
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
వనపర్తి
జిల్లా వార్తలు
శనివారం 16 నవంబరు 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0





ఉమామహేశ్వర క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నాణ్యత డొల్ల..



● ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అడ్రస్ తెలియని జిల్లా

» ఆహార పదార్థాల నాణ్యతపై పర్యవేక్షణ కరువు

» గద్వాల జిల్లాకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేనట్లేనా....?

» కాలం చెల్లిన పదార్థాలను అంటకడుతున్న బేకరీలు, దుకాణాలు

» రోగాల బారిన పడుతున్నామంటున్న ప్రజలు

» చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు

చెడువాసన వస్తున్న కుష్క(ఫైల్)

● అధికారి లేరు.... ఫోన్ అందుబాటులో లేదు

ఈ విషయంపై ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమాను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఫోన్ అందుబాటులో లేదు. అధికారి విషయంపై ఆరా తీయగా జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ అధికారులకు కూడా ఈ అధికారి ఎవరో తెలియదనే చెబుతున్నారు. చివరకు ఆమె ఫోన్ నంబర్ కూడా ఎవరికీ అందుబాటులో ఉండదని చెప్పడం కొసమెరుపు.

గద్వాల క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆహార పదార్థాల నాణ్యతపై పర్యవేక్షించే అధికారులు లేకుండా పోయారు. ఇలా అధికారులు లేకపోవడంతో హోటళ్లు, బేకరీలు, కిరాణదుకాణాల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నాణ్యతలేని ఆహార పదార్థాలను ప్రజలకు అంటగడుతున్నారు. గత కొన్నేళ్లుగా జిల్లాలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేకుండా పోవడంతో బేకరీలు, హోటళ్ల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం ఎక్కడా కానరాకుండా పోవడంతో పాటు వారి ఫోన్ నంబర్లు కూడా అందుబాటులో లేకపోవడంతో బాధితులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఇన్‌చార్జి పాలనలో అధికారి ఉండటంతో ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. కనీసం ఫోన్ నంబర్ కూడా అందుబాటులో ఉండకపోవడం విడ్డూరం.

● బేకరీలు, హోటళ్లలో చెడువాసన వస్తున్న ఆహారపదార్థాలు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తా సమీపంలో కొంతకాలం క్రితం నూతన బేకరి ఏర్పడింది. దీంతో వ్యాపారం పెంచేందుకు అన్ని రకాల కేక్స్‌తో పాటు అక్కడే కూర్చొని తినడానికి కూడా ఏర్పాటు చేసుకున్నారు. అంతవరకు బాగానే ఉంది.. కానీ నాణ్యతలో మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం కొన్నిరోజుల క్రితం జరిగిన సంఘటనే. జిల్లా కేంద్రానికి చెందిన దౌలత్‌పాషా అనే వ్యక్తి బేకరిలో కారాబిస్కెట్ ప్యాకెట్‌ను రూ. 50కు కొనుగోలు చేశాడు. అయితే వాటిని తినేందుకు ప్రయత్నించగా వెంటనే చెడువాసన రావడంతో ఇది ఏమిటి అని దుకాణ యజమానిని ప్రశ్నించాడు.. చెడువాసన వస్తుంది.. ఈ బిస్కెట్‌లు పాడయ్యాయని చెబుతున్నా వినకుండా సదరు బేకరీ యజమాని అతడిపై రుసరుసలాడాడు. వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. నాణ్యతలేని పదార్థాలను అంటగడుతావా అంటూ బేకరి యజమానిని ప్రశ్నించగా.. మేము ఇలాగే అమ్మేది.. ఇష్టం వస్తే తీసుకో... లేదంటే లేదు అని గద్దించాడు. చివరకు మునిసిపల్ హెల్త్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి బేకరి యజమానిపై ఫిర్యాదు చేశారు. అయితే పరిశీలించిన ఆ అధికారి ఇది మా పరిధికి రాదని చెప్పడంతో చేసేది లేక వెనుదిరిగాడు. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన ఓ యువకుడు ఆహారపదార్థాలను పార్శిల్ కట్టించుకుని ఇంటికి వెళ్లి తినేందుకు ప్రయత్నించగా.. అందులో చనిపోయిన బొద్దింక కనపడటంతో అవాక్కయ్యాడు. అంతేకాక జిల్లా కేంద్రంలోని వేణుకాలనీకి చెందిన దిలీప్‌కుమార్ అనే యువకుడు జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఇటీవలే కుష్క పార్శిల్ తీసుకొని వచ్చి ఇంటిలో తినేందుకు ప్రయత్నించగా దుర్గంధపు వాసన వచ్చింది. ఆ యువకుడు చెడువాసన వస్తుందని ఏమిటని ప్రశ్నించగా తిరిగి ఆ యువకుడిపై దాడికి యత్నించినట్లు తెలిసింది. ఈ కుష్క తీసుకొని ఫుడ్ఇన్‌స్పెక్టర్ కొరకు వెతికినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇలాంటి విషయాలను అధికారులకు చెబుతామన్నా అందుబాటులో లేరు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



బేకరిలో కొనుగోలు చేసిన దౌలత్‌పాష(ఫైల్)

ఆ నూనెలతో రోగాలు తప్పనిసరి

అయితే చిన్నారులు ఇష్టంగా తినే నూడుల్స్, గోబీ, చికెన్ పకోడి సెంటర్ వంటి పదార్థాలను ఒక్కసారిగా పరిశీలిస్తే రోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఉపయోగించే నూనెలతో పాటు అందులో ఉపయోగించే పదార్థాలు కూడా నాణ్యత లేకుండా పోతున్నాయి. ఇందులో ఉపయోగించే నూనెలను పదేపదే ఉపయోగించడంతో పాటు కల్తీనూనెలు వాడుతున్నట్లు తెలుస్తున్నది. వీటిపై ప్రజలు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక గతంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పేందుకు వెళ్లగా... ఇవి మాకు సంబంధం లేనట్లు వ్యవహించినట్లు తెలుస్తుంది. దీంతో వీటిని తిన్న ప్రజలు ఫుడ్ పాయిజన్ అయి రోగాల బారిన పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అలంపూరు బాలబ్రహ్మేశ్వరస్వామికి నమస్కరిస్తున్న మహిళ



ఉమామహేశ్వరంలో భక్తుల రద్దీ

కార్తీక కాంతులు

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక కాంతులతో కళకళలాడాయి. శుక్రవారం కార్తీక పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో పాటు పురుషులు సైతం దీపాలు వెలిగించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. - మరిన్ని వివరాలు 6వ పేజీలో...



వనపర్తి రామాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అలంపూరు ఆలయంలో నదీ హారతి ఇస్తున్న అర్చకులు

మహనీయుల ఆశయాలతో ఎదగాలి

» సమానత్వం కోసం పోరాడాలి

» ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం

6



విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

కొలువు చేజిక్కిన వేళ..

» గ్రూప్-4 ఫలితాల్లో ఉమ్మడి జిల్లా యువత విజయ కేతనం

వివరాలు 7వ పేజీలో...

వసూల్ రాజాలు

» అనుమతిలేని.. అక్రమ నిర్మాణాలే వారికి ఆదాయం

» ఉన్నతాధికారుల పేరు చెప్పి వసూలు

» నిర్మాణం పూర్తయి.. ఓపెనింగ్ సమయంలో డమ్మీ నోటీసులతో హల్‌చల్

» రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు

» లిఖితపూర్వక ఫిర్యాదులతో ఒకరిపై వేటు.. మిగతా ఇద్దరిపైనా నజర్

6



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

» కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బిహార్‌లోని జాముయ్‌లోని ప్రధాని మోదీ ఆయనకు నివాళులర్పించి ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారం ద్వారా నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన ఆదివాసి నాయకులు మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ఆదివాసీల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు నిర్వహించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. వివిధ గిరిజన పాఠశాలలకు చెందిన విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలను ఉట్టిపడేలా నిర్వహించిన నృత్యాలు ప్రతీ ఒక్కరిని ఆకర్షించాయి. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

తప్పిన ముప్పు

- పంట పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు

పెబ్బేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బస్సు ప్రమాదానికి గురైన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పెద్దపల్లి జిల్లా ఉరంపల్లి గ్రామానికి చెందిన 14 మంది, కరీంనగర్ జిల్లా దుష్పుడు గ్రామానికి చెందిన 35 మంది ప్రయాణికులు అలంపూర్ జోగుళాంబ ఆలయానికి కార్తీక పౌర్ణమి దర్శనానికి బయలుదేరారు. వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపైకి శుక్రవారం తెల్లవారు జామున రాగానే అదుపు తప్పిన బస్సు పంట పొలాల్లోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పోలీసులు వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేటు బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు చెప్పారు. గాయపడిన వారిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి పరామర్శించారు.



పెబ్బేరు వద్ద అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయిన ప్రైవేటు బస్సు

మాజీ సైనికుడి అవయవ దానం

గోపాల్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 30 ఏళ్ళు దేశం కోసం సరిహద్దులో కాపాలా కాసి ఉద్యోగ విరమణ తర్వాత మండల ఆదర్శ రైతుగా ప్రశంసలు పొందిన ఆ సైనికుడు మరణం తర్వాత కూడా శెభాష్ అనిపించుకున్నాడు. మరణంలోనూ పరుల కోసం తన అవయవాలను దానం చేశాడు. మృతుడి బంధువు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని పొలికెపాడ్ గ్రామానికి చెందిన వర్ని బాలయ్య, లచ్చమ్మ దంపతుల రెండో కుమారుడు వర్ని ఆంజనేయులు (60) 1987లో ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. 30 ఏళ్ళు తన సేవలందించి ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత గ్రామంలో ఉంటూ వ్యవసాయం చేపట్టాడు. తనకున్న ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట వేసి మండలంలోనే అధిక దిగుబడి సాధించి ఆదర్శ రైతుగా అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన వనపర్తి నుంచి గ్రామానికి బైక్‌పై వెళతూ వనపర్తిలోని జమ్మిచెట్టు దగ్గర బ్రెయిన్ స్ట్రోక్‌తో కిందపడ్డాడు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంటిలేటర్‌పై ఉన్న ఆయన ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉన్నది. దీంతో నీ మరణం వృథాకానివ్వమని అతని భార్య అలివేల, ఇద్దరు కూతుళ్ల భార్గవి, లావణ్య అంగీకరం మేరకు గురువారం అతని అవయవాలు గుండె. లివర్. కిడ్నీలను దానం చేశారు. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.



అవయవ దానం చేసిన సైనికుడు ఆంజనేయులు (ఫైల్)

వేడి సాంబార్‌లో పడి బాలుడి మృతి

» వలస కుటుంబంలో పుత్రశోకం

వడ్డేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సెల్ ఫోన్‌తో ఆడుకుంటూ జగదీష్(6) అనే బాలుడు పెళ్లి చూపుల కార్యక్రమం వద్ద ఏర్పాటు చేసిన సాంబార్‌లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఈ హృదయ విదారక సంఘటన కర్నూలు జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామానికి చెందిన లక్ష్మి, వీరేష్ దంపతులు జీవనోపాధి కోసం కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఏంగోడు గ్రామానికి వలస వెళ్లారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు జగదీష్ ఉన్నారు. కాగా, వారి సమీప బంధువుల యువతి పెళ్లి చూపులు ఏంగోడు గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్‌తో ఆడుకుంటున్న జగదీష్ మగపెళ్లి వారి కోసం ఏర్పాటు చేసిన విందులో ఉన్న వేడి సాంబార్ పాత్రలో పడ్డాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు గమనించి స్థానికుల సహాయంతో హుటాహుటిన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. దీంతో ఉన్న ఒక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం బాలుడి మృతదేహాన్ని స్వగ్రామమైన పైపాడుకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.



జగదీష్ (ఫైల్)



పాలమూరులో భక్తిపారవశ్యంతో మహిళ

ఉమామహేశ్వరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మహబూబ్‌నగర్‌లోని సాంబ శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న యువతులు, నమస్కరిస్తున్న యువతి

కార్తీక కాంతులు

- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కార్తీకం.. కాంతులతో ఆలయాలు కళకళలాడాయి. కార్తీకమాసంలో భాగంగా శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉదయం తెల్లవారుజామున, సాయంత్రం పొద్దుపేయే దాకా దీపాలు వెలిగించారు. మహిళలతో పాటు పురుషులు సైతం దీపాలు వెలిగించి భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



శ్రీరంగాపురం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు

కురుమూర్తిలో సూర్య నమస్కారం

కురుమూర్తి ఆలయం మెట్ల వెంట దీపాలు పెడుతున్న మహిళ

వనపర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపాలతో సెల్ఫీ

భక్తులతో కిక్కిరిసిన జోగుళాంబ ఆలయం

అలంపూరు/అచ్చంపేట/చారకొండ/ శ్రీరంగాపురం/ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలలో శుక్రవారం భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక పౌర్ణమి అందులో కృతికా నక్షత్రం కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించుకొని కార్తీక దీపం వెలిగించారు.

దీపకాంతులలో ఉమామహేశ్వరం

● ఉమామహేశ్వర క్షేత్రం కార్తీక దీపకాంతులతో వెలుగొందింది. వేకువజామునుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలగించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఉదయం ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకులు వీరయ్య శాస్త్రీ, రవిలు లింగాభిషేకం, చండీయాగం నిర్వహించారు.

సిర్సనగండ్లలో సామూహిక వ్రతాలు

చారకొండ మండలంలో అపర భద్రాదిగా పేరుగాంచిన సిర్సనగండ్ల సీతా రామచంద్ర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఆలయ ఈవో ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు ధేరం లక్ష్మణశర్మ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. 80 మంది దంపతులు పాల్గొన్నట్లు వారు తెలిపారు. గ్రామానికి చెందిన నారయణ్ రాంరెడ్డి, శ్యామలమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, స్వాతి దంపతులు అన్నదానం చేశారు.

శ్రీరంగనాథ స్వామి ఆలయంలో..

శ్రీరంగాపురంలో రంగనాథ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పురస్కరించుకుని స్వామి వారికి అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. సాయంత్రం దీపారాధన కార్యక్రమం ఉంటుందని ఆలయ అర్చకులు విష్ణుస్వామి, సురేష్ ఆచార్యులు కిట్టు స్వామి, కన్నయ్య స్వామి ధనుంజయచార్యులు పాల్గొన్నారు. కాగా, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కురుమూర్తి ఆలయానికి భక్తులు పోటెత్తారు.



మహబూబ్‌నగర్ బ్రాహ్మణవాడి వాసవీ కన్యకా పరమేశ్వరాలయంలో భక్తులు



చారకొండ: సిర్సనగండ్ల సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు



అలంపూరు వద్ద తుంగభద్ర నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

వనపర్తి పీజీ సెంటర్ అభివృద్ధికి సహకరించాలి



రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ప్రతిపాదనలు అందిస్తున్న పీయూ వీసీ

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి పీయూ వీసీ, రిజిస్ట్రార్ వినతి

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న వనపర్తి పీజీ సెంటర్ అభివృద్ధికి సహకరించాలని పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. వనపర్తిలోని పీజీ సెంటర్‌కు బాలికల, బాలుర హాస్టల్ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని, అలాగే పీజీ సెంటర్ విస్తరణకు ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఇద్దరికీ చిన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి జూపల్లిని కలిసిన పీయూ వీసీ: పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావును శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

మహనీయుల ఆశయాలతో ఎదగాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

- సమానత్వం కోసం పోరాడాలి
- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం

ఇటిక్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాలతో సమాజంలో సమానత్వం కోసం ప్రతీ ఒక్కరూ చదువుకొని ఆదర్శవంతంగా ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని షాబాద గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాల ఆవిష్కరణకు శుక్రవారం ప్రొఫెసర్ కాశీం, న్యాయవాది కదిరే కృష్ణ హాజరై మాట్లాడారు. వందేళ్ల క్రితం ఎలా ఉందో నేటికీ సమాజంలో కులమత బేధాలున్నాయన్నారు. సమాజాన్ని చైతన్య పరచడానికి మహనీయులు అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం జీవిత కాలం కృషి చేశారన్నారు. యువత మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు బానిసలు కారాదని సూచించారు. న్యాయవాది కదిరే కృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ప్రజలకు వజ్రాయుధం లాంటి హక్కును కల్పించారని ఓటు ద్వారానే జీవితాలను బాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి అంబేడ్కర్ యువజన సంఘం సభ్యుడు మోహన్‌బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మధసూదన్‌బాబు, బాలకృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేష్, ఇమ్మానియేలు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

వసూల్ రాజాలు

- పాలమూరు పురపాలికను శాసిస్తున్న ముగ్గురు చైన్‌మెన్లు
- ఉన్నతాధికారుల పేరు చెప్పి వసూళ్లు

మహబూబ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలికలో అనుమతులు, సెట్‌బ్యాక్‌లు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించి అధికారుల దృష్టికి తెచ్చేందుకు నియమించిన చైన్‌మెన్‌లు అవినీతికి పాల్పడుతున్నారు. పురపాలిక రోజు రోజుకు విస్తరిస్తోంది. కొత్త కాలనీలు ఏర్పడటంతో పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపట్టడం, జీ ప్లస్ వన్ అనుమతులు పొంది పెంట్‌హౌస్‌లు, షెడ్‌లు నిర్మిస్తుండటంతో వాటన్నింటికి చెక్ చేసేందుకు ప్రణాళిక విభాగంలో చైన్‌మెన్‌లను ఏర్పాటు చేశారు. వీరికి వార్డులను విభజించారు. వారు ఆయా వార్డులలో చేపట్టే నిర్మాణాలు, ఆక్రమణలు, సెట్‌బ్యాక్‌లను పరిశీలించి, అధికారుల దృష్టికి తీసుకెళ్ళాల్లి ఉంటుంది. వీరు రోజూ వార్డులలో తిరిగి, ఎక్కడెక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో పరిశీలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను గుర్తిస్తున్నారు. కానీ వాటిని ప్రారంభించిన వెంటనే కట్టడి చేయకుండా, నిర్మాణాలు జరుగుతున్నప్పుడు రంగంలోకి దిగుతున్నారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్లాబ్ వేసే సమయంలో వెళ్లి పనులను పనులను ఆపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నందుకు అడిగినంత డబ్బు ఇవ్వాలని, లేదంటే తాము చేయాల్సిన పని చేస్తామని బెదిరిస్తుండటంతో స్లాబ్ వేయడానికి అంతా సిద్ధం చేసుకున్న ఇంటి యజమానులు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. అన్ని అనుమతులున్నా సెట్‌బ్యాక్ లేదంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రతి ఇంటి యజమాని తనకున్న ప్లాట్ ముందువైపు మొక్కల పెంపకం కోసం రెండున్నర అడుగులు వదిలి, నిర్మాణాలు చేపట్టాలి. చాలామంది సెట్‌బ్యాక్ స్థలం వదలకుండా కాంపౌండ్ నిర్మించుకుంటున్నారు.



పాలమూరు పట్టణం

ఫిర్యాదులు రావడంతో చర్యలు

చైన్‌మెన్‌లపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఒక వ్యక్తిపై ఎక్కువగా ఫిర్యాదులు రావడంతోపాటు ఎక్కడ పోయినా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని లిఖితపూర్వగా ఫిర్యాదులు రావడంతో ఆయన్ను శానిటేషన్ విభాగానికి మార్చాం. అక్కడి నుంచి ఇద్దరిని ప్రణాళిక విభాగానికి మార్చాము. మిగతా ఇద్దరు సిబ్బందిపైనా ఫిర్యాదులు ఉన్నాయి. ఒకేసారి అందరిని మార్చడం కాకుండా నెమ్మదిగా మిగతావారిని కూడా ఆ విభాగం నుంచి మరో విభాగానికి మారుస్తాం.

\- మహేశ్వర్‌రెడ్డి, పురపాలిక కమిషనర్

అనుమతులు లేకుండానే సెల్లార్‌లు

సెల్లార్‌లకు పాలమూరులో అనుమతులు లేవు. 2-3 భవనాలకు మినహా మిగతా అన్నింటినీ అనుమతులు లేకుండా నిర్మించారు. ఈ సెల్లార్ నిర్మాణాలు కూడా పరోక్షంగా పురసిబ్బంది సహకారంతోనే నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాలమూరులో వంద వరకు సెల్లార్‌లతో ఏర్పాటు చేసిన భవనాలున్నా యి. న్యూటౌన్, శెట్టి కాంప్లెక్స్ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఆస్పత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో చాలావరకు నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టడం లేదు. వీటి విషయంలో పెద్ద మొత్తంలోనే డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

ఒకరిని తప్పించి ఇద్దరి నియామకం..

చైన్‌మెన్‌లపై అధికారులకు రెగ్యులర్‌గా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల ఒకరిపై లిఖితపూర్వక ఫిర్యాదులు రావడంతో అతన్ని తప్పించి, శానిటేషన్ విభాగానికి మార్చారు. శానిటేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరిని టౌన్‌ప్లానింగ్ విభాగంలో నియమించారు. అయితే గతంలోనే ఒకరిని ఇలానే శానిటేషన్ విభాగానికి మార్చినా ఆయన పైరవీ చేసుకుని, మళ్లీ అదే స్థానానికి వెళ్ళిపోయారు. ఇప్పుడు కూడా శానిటేషన్‌కు మారిన సదరు ఉద్యోగి అక్కడే ఉంటాడా? పైరవీతో మళ్లీ అదేస్థానానికి వస్తాడా? అన్న చర్చ సాగుతోంది.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

బాలానగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అప్పటి వరకు కళ్లముందు పనులు చేసిన ఓ భవన నిర్మాణ కార్మికుడు అధికారులు నిర్లక్ష్యంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి బలైన ఘటన శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చిన్నరేవల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉనాయి. చిన్నరేవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దచెలుక తండాకు చెందిన గణ్యా నాయక్ (53) అనే వ్యక్తి వ్యవసాయ పనులతో పాటు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చిన్నరేవల్లి గ్రామంలోని ప్రధాన రహదారిలో గల ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రధాన రహదారి మీదుగా నివాసాలకు దగ్గరగా ఈ విద్యుత్ తీగలను ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదం చోటుచేసుకున్నదని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి తమ కుటుంబ పెద్ద బలయ్యాడని మృతుడి కుటుంబ సభ్యులు రోదించారు. ఈ వేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గతంలో కూడా ఇక్కడ విద్యుత్‌షాక్‌తో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని గ్రామస్థులు తెలిపారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

- ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నాం
- పనితీరు బాగాలేని మెడికల్ ఆఫీసర్లపై చర్యలు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ

మహబూబ్‌నగర్ వైద్య విభాగం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీలలో డాక్టర్ల కొరతతో ప్రజలకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీనిపై ఏమంటారు?

కొన్ని పీహెచ్‌సీలలో డాక్టర్లు పీజీ విద్యకోసం వెళ్లారు. ఆ పీహెచ్‌సీలలో రోగులకు ఇబ్బందులు కలుగకుండా కొందరు డాక్టర్లకు ఇన్‌చార్జీ బాధ్యతలు ఇచ్చాము. ఎంఎల్‌హెచ్‌పీలతో కూడా సర్దుబాటు చేశాం. ప్రస్తుతం డాక్టర్ల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

చాలా పీహెచ్‌సీలలో మందుల కొరత తీవ్రంగా ఉంది. దాన్ని ఎలా అధిగమిస్తున్నారు?

రెండు నెలల క్రితం వరకు మందుల కొరత ఉండింది. ప్రస్తుతం కొరత లేకుండా చూస్తున్నాం. తాజాగా ప్రభుత్వం నుంచి మందుల సరఫరాపై అనుమతులు వచ్చాయి. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు చాలా మందులు వచ్చాయి. పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు ఈ ఔషధిలో నమోదు చేయించి, సీడీఎస్ నుంచి తీసుకోవాల్సి ఉంది. ఈ రెండు రోజుల్లో ఆ ప్రక్రియ కూడా పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చాం.

పీహెచ్‌సీలలో రోగులకు నిరంతర వైద్యసేవలు అందడం లేదు. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. వారిపై చర్యలు తీసుకుంటున్నారా?

పీహెచ్‌సీలలో నిరంతర వైద్య సేవలు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం. మెడికల్ ఆఫీసర్లకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం. అందుబాటులో లేని డాక్టర్లు, సిబ్బందిపై కలెక్టర్ అనుమతితో వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. విధులకు గైర్హాజరైనా, రోగుల పట్ల నిర్లక్ష్యం వహించినా వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

పీహెచ్‌సీలలో కాన్పులు జరగడం లేదు. అన్ని కేసులను జనరల్ ఆస్పత్రికే ఎందుకు రెఫర్ చేస్తున్నారు?

పీహెచ్‌సీలలో కాన్పులు తక్కువగా అవుతున్నాయని మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఆయా కేసుల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నాం. త్వరలో పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నాం. పనితీరు బాగాలేని మెడికల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి కూడా ఇన్‌స్టిట్యూషన్ డెలివరీలు పెరగాలని, నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు వచ్చాయి. వాటి ఆధారంగా చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలలో సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా అవుతున్నాయి. సాధారణ కాన్పులు జరగడం లేదు. దీనిపై ఏమంటారు?

ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వివరాలు సేకరిస్తున్నాం. ఏయే ఆస్పత్రుల్లో ఎక్కువ సిజేరియన్ ఆపరేషన్లు అవుతున్నాయి? అందుకు గల కారణాలపై ఆస్పత్రుల యాజమాన్యాలు, డాక్టర్లతో వివరణ తీసుకుంటాం. కలెక్టర్ అనుమతితో ఐఎంఏ, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేయిస్తాం.

జిల్లాలో ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తున్నారు. రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ కమిషన్లు తీసుకుంటున్నారు. వారిని ఎలా కట్టడి చేస్తారు?

ఆర్ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేయిస్తాం. అందులో వారు చేయాల్సిన వైద్యంపై క్షుణ్ణంగా తెలియజేస్తాం. స్థాయికి మించి వైద్యం చేస్తే వారి క్లినిక్‌లను శాశ్వతంగా మూసి వేయిస్తాం. వారి వద్దకు వచ్చే కేసులను ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేసేలా అవగాహన కల్పిస్తాం.

కొలువు చేజిక్కిన వేళ..

గ్రూప్-4 ఫలితాల్లో ఉమ్మడి జిల్లా యువత విజయ కేతనం

సర్కారు ఉద్యోగం సాధించాలని కలలు కన్నారు.. రేయింబవళ్లు ఇష్టంగా కష్టపడ్డారు. కోరుకున్న కొలువు సాధించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన పలువురు యువతీ యువకులు గ్రూప్-4 ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. వారిలో ఒకే సారి మూడు ఉద్యోగాలు సాధించిన వారు ఇద్దరు, రెండు ఉద్యోగాలకు ఎంపికైన వారు మరొకరు ఉన్నారు. అలాగే అన్నా చెల్లెళ్లు ఒకే సారి విజయం సాధించి అభినందనలు అందుకున్నారు. ఇలా మరెందరో యువతీ యువకులు ఉద్యోగం సాధించి విజయ పథాన ముందుకు సాగుతున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు

» అన్నసాగర్‌కు చెందిన నీరేశ్ ప్రతిభ

భూత్పూర్, (ఆంధ్రజ్యోతి) : ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని అన్నసాగర్‌కు చెందిన కర్నెకోట నీరేశ్. డిగ్రీ పూర్తి చేసిన అతడు 2018లో మొదటి సారి కానిస్టేబుల్ ఉద్యోగా సాధించారు. ఆ ఉద్యో గం చేస్తుండగానే 2019లో రైల్వేలో గేట్‌వాచర్‌గా ఎంపికయ్యాడు. ఆ విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్-4 కు సన్నద్ధం అయ్యాడు. గురువారం విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో రెవెన్యూ శాఖలో సీసీఎల్- జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన నీరేశ్ తల్లిదండ్రులు చిన్నరాజోజీ, సుమిత్ర. వారికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నీరేశ్ అందరి కంటే చిన్నవాడు. సివిల్స్‌లో ర్యాంకు సాధించి, ఐఏఎస్, ఐపీఎస్ కావడమే తన లక్ష్యమని చెప్తున్నారు.



ఒకే సారి మూడు కొలువులు

» గిరిజన యువకుడు రాజేశ్

ఖిల్లాఘణపురం (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం, దొంతికుంట తండాకు చెందిన లావుడియా రాజేష్ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రూప్ - 4 ఫలితాల్లో మునిసిపల్ వార్డు ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైన ఆయన, 2024, మార్చిలో ఫైర్‌మెన్‌గా ఎంపికయ్యారు. శిక్షణ పూర్తి చేసుకొని ఆత్మకూరు ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే తెలంగాణ హైకోర్టు జూనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగానికీ ఎంపికయ్యారు. డిసెంబర్‌లో విధుల్లో చేరాల్సి ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడైన మేనమామ నానులాల్ ప్రోత్సాహంతో విజయం సాధించినట్లు చెప్పారు.



రైతు బిడ్డకు సర్కార్ కొలువు

» మగ్దూంపూర్‌కు చెందిన శ్వేత

ఊట్కూర్ (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని మగ్దూంపూర్ గ్రామానికి చెందిన రైతు బిడ్డ జె.శ్వేత సర్కార్ కొలువుకు ఎంపికయ్యింది. గ్రూప్ - 4 ఫలితాల్లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో స్టోర్ కీపర్ ఉద్యోగం సాధించింది. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసిన ఆమె హైదరాబాద్‌లోనూ ఉంటూ గ్రూప్-1కు సన్నద్ధం అవుతోంది. మెయిన్స్ రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. గ్రూప్-4 పరీక్ష రాసి ఉద్యోగం సాధించింది. గ్రూప్ -1 సాధించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపింది.





అన్నాచెల్లెళ్లకు ఉద్యోగాలు

» రాచూరుకు చెందిన శ్రీకాంత్, లలిత

వెల్దండ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని రాచూరు గ్రామానికి చెందిన అన్నా చెల్లెళ్లు జాక్‌పాట్ కొట్టారు. గ్రామానికి చెందిన గంగధారి వెంకటేశ్, స్వరూప దంపతుల కుమారుడు గంగదారి శ్రీకాంత్ భూ పరిపాలన విభాగంలో జూనియర్ అసిస్టెంటుగా, కుమార్తె గంగదారి లలిత ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగాలు సాధించారు. శ్రీకాంత్ జెఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేశారు. లలిత జేఎన్‌టీయులో బీటెక్ పూర్తి చేసింది. వీరిద్దరూ మొదటి సారి రాసిన పోటీ పరీక్షల్లోనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం విశేషం.

నాన్నకు ప్రేమతో..

» ఆయన కోరిక మేరకు సర్పంచ్ పదవి
» నా చదువుకు సార్థకత కోసం ఉద్యోగం
» మాజీ సర్పంచు జయంతి శంకర్‌నాయక్

పెద్దమందడి, నవంబరు, 15 (ఆంధ్రజ్యోతి) : మా నాన్నకు సేవాభావం ఎక్కువ. ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొని, ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కానీ ఆయనకు అవకాశం రాలేదు. దీంతో నన్ను సర్పంచుగా చూడాలనుకున్నారు. ఈ క్రమంలో మా స్వగ్రామం ముందరి తండా 2018లో గ్రామ పంచాయతీగా ఏర్పాటయ్యింది. 2019 స్థానిక సంస్థల సందర్భంగా నేను ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యేలా నాన్న కృషి చేశారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి నాన్న కోరిక నెరవేర్చాను. కానీ ఆ తర్వాత కొన్ని నెలలకే ఆయన మాకు దూరమ య్యారు. సర్పంచ్‌గా ఐదేళ్ల పాటు గ్రామా భివృద్ధికి కృషి చేశాను. బీటెక్ చేస్తున్న సమయంలోనే నాకు పెళ్లి అయ్యింది. భర్త శంకర్‌నాయక్ సహకారంతో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సర్పంచ్ పదవీ కాలం పూర్తయ్యాక ఏఈఈ పరీక్షలు రాశాను, కానీ జాబ్ రాలేదు. గ్రూప్-2 కోసం సిద్ధం అవుతూనే గ్రూప్ - 4 పరీక్ష రాసి ల్యాండ్ అడ్మిన్‌స్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాను. గురువారం ప్రకటించిన ఫలితాల్లో ఎస్టీ ఉమెన్ కోటాలో జిల్లా మొదటి ర్యాంకు సాధించాను. రాజకీయాల్లో ప్రజలకు సేవ చేసి, మన్ననలను పొందినట్లుగానే, ఉద్యోగంలో కూడా మంచి పేరు తెచ్చుకోవడానికి కృషి చేస్తాను. నాన్న ఆశయం, నా కోరిక రెండూ నెరవేర్చినందుకు ఆత్మ సంతృప్తిగా ఉంది.



ఒకే గ్రామంలో ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగాలు

మక్తల్ (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ - 4 ఫలితాల్లో మక్తల్ మండలం కర్ని గ్రామానికి చెందిన ముగ్గురు ఉద్యోగాలు సాధించారు. అదే మండలంలోని చిట్యాలకు చెందిన మరో యువకుడు కూడా ఎంపికయ్యాడు.



బి. కల్యాణ్ : కర్ని గ్రామానికి చెందిన కల్యాణ్ గ్రూప్ - 4లో అర్హత సాధించి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. అంతకు ముందే ఆయన గ్రూప్-1 మెయిన్స్‌కు కూడా అర్హత సాధించాడు. ఆయన తండ్రి శ్రీనివాస్‌రెడ్డి పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్నారు.



నందిని : కర్ని గ్రామానికి చెందిన నందిని మైనార్టీ రెసిడెన్సియల్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. ఆమె భర్త రాజీవ్‌రెడ్డి ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి. భర్త రాజీవ్‌రెడ్డి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించినట్లు ఆమె తెలిపారు.



భాస్కర్‌రెడ్డి : కర్ని గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఆయన తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భాస్కర్‌రెడ్డి ఇప్పటికే కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. తల్లిదండ్రుల ఆశయం మేరకు ఉద్యోగం సాధించినట్లు తెలిపారు.



దయాకర్‌గౌడ్ : మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన దయాకర్‌గౌడ్ గ్రూప్- 4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. గతంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా, పంచాయతీ సెక్రెటరీగా ఉద్యోగం వచ్చినా, ప్రస్తుతం ఆయన ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

వైకల్యాన్ని జయించాడు

» ప్రతిభావంతుడు బొంగు రమేశ్



పెబ్బేరు, (ఆంధ్రజ్యోతి) : అతడు వైకల్యాన్ని జయించాడు. అంధత్వాన్ని లెక్క చేయక, ప్రతిభతో రాణించి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు. పెబ్బేరు మునిసిపాలిటీ లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన బొంగు రమేశ్ పుట్టుకతోనే పాక్షిక అంధుడు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఆయన టీచర్‌గా ఎంపిక య్యాడు. తాజాగా గ్రూప్ - 4లో పరీక్షలు రాసి ఉద్యోగం సాధించాడు. తనకు ఒక కన్ను పూర్తిగా, మరో కన్ను 50 శాతం కనిపించదని తెలిపారు. వచ్చిన రెండు ఉద్యోగాల్లో, దేనిలో చేరాలో త్వరలో నిర్ణయం తీసుకుంటానని ఆయన చెప్పారు.



నెల రోజుల్లోనే రెండు ఉద్యోగాలు

» కల్వకోలుకు చెందిన కవిత

పెద్దకొత్తపల్లి (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని కల్వకోలు గ్రామానికి చెందిన పద్మ వెంకట స్వామిల కుమార్తె కవిత ఒకే నెలలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఇటీవలే ట్రైన్డ్ గ్యాడ్యుయేట్ ఫిజికల్ టీచర్ (టీజీటీ)గా ఉద్యోగం వచ్చింది. తెలకపల్లి గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. తాజాగా గ్రూప్-4లో రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం తెచ్చుకుంది. తల్లిదండ్రులు పద్మ, వెంకటస్వామి, భర్త మురళి సహకారంతో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు ఆమె తెలిపారు.



ఉన్నతస్థాయికి ఎదగడమే లక్ష్యం

» పులికల్‌కు చెందిన గాండ్ల అనూష

అయిజ (ఆంధ్రజ్యోతి) : ఉన్నత స్థాయికి ఎదగడమే తన లక్ష్యమని గాండ్ల అనూష అన్నారు. జోగు ళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన ఆమె తండ్రి గాండ్ల మల్లేష్ న్యాయవాది కాగా, తల్లి రేణుకమ్మ అంగన్‌వాడి టీచర్‌గా పని చేస్తోంది. గ్రూప్ -1 ప్రిలిమ్స్ అర్హత సాధించి, మెయిన్స్ పరీక్ష రాసింది. గ్రూప్-4లో ప్రతిభ చూపి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రులు, తమ్ముడు అభినయ్‌ల సహకారంతో తాను విజయం సాధించినట్లు ఆమె తెలిపారు.



గ్రూప్ 2 జాబ్ కొట్టడమే లక్ష్యం

» వల్లపు ఆంజనేయులు, రాయవరం

అచ్చంపేట (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 జాబ్ కొట్టడమే తన లక్ష్యమని నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన వల్లపు ఆంజనేయులు అన్నారు. ఆయనకు మొదల రైల్వే శాఖలో ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. అనంతరం 20-16లో కానిస్టేబుల్ జాబ్ కూడా వచ్చింది. కానీ వెళ్లలేదు. ఇప్పుడు గ్రూప్-4లో ఉద్యోగం సాధించారు. ఈ ఉద్యోగం చేస్తూనే గ్రూప్-2 జాబ్ సాధించాలన్నది తన లక్ష్యమని తెలిపారు.



కష్టానికి తగిన ఫలితం దక్కింది

» స్వప్న, అమ్రాబాద్

పడిన కష్టానికి ఫలితం దక్కడం చాలా ఆనందంగా ఉందని బి. స్వప్న అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆమె గ్రూప్ - 4 ఉద్యోగ నియామకాల్లో ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. తాను 2019 నుంచి నుంచి వివిధ పోటీ పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. అందులో భాగంగా గ్రూప్ - 4 పరీక్ష రాసి, ఉద్యోగం సాధించానని చెప్పారు.



ప్రతీ రోజు 10 గంటల చదువు

» ఎస్.కీర్తి, మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు 10 గంటలు చదవడం వల్లే ఉద్యోగం సాధించగలిగానని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీకి చెందిన కీర్తి అన్నారు. కీర్తి తండ్రి ఎస్.వెంకట్‌రామ్‌రెడ్డి జీహెచ్ఎంగా, తల్లి కళావతి ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. వారి ప్రోత్సాహంతో గ్రూప్-4 పరీక్షలో విజయం సాధించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ మునిసిపల్ వార్డు ఆఫీసర్‌గా ఉద్యోగం రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రూప్ - 1 కూడా రాశానని, ఆ ఉద్యోగం కూడా వస్తుందని కీర్తి ధీమా వ్యక్తం చేశారు.

స్పోర్ట్స్ బాక్స్

మంగళూరుకు పీయూ క్రాస్‌కంట్రీ జట్లు



మంగళూరుకు వెళ్లనున్న క్రాస్ కంట్రీ జట్టు సభ్యులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ క్రాస్‌కంట్రీ స్త్రీ, పురుషుల జట్లు కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరుకు బయలుదేరి వెళ్లాయి. అక్కడి విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఆలిండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొననున్నాయి. ఈ పోటీలు ఈ నెల 18 నుంచి 20 వరకు పోటీలు జరుగుతాయని పీజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి పాలమూరు యూనివర్సిటీకి విజయం అందించాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫాం అందించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, కోచ్‌లు నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 22 నుంచి క్రీడాకారుల ఎంపిక

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ అనుబంధ కళాశాల విద్యార్థులకు ఈనెల 22 నుంచి 27 వరకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పీయూ పీడీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న మహిళలు, పురుషుల వాలీబాల్ జట్లు, 23న పురుషుల ఫుట్‌బాల్ జట్టు, 25న పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు, 26, 27న మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్ జట్లు ఎంపికలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టు మేనేజర్‌గా ఫారుఖ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అం డర్-17 బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బా లుర జట్టుకు మేనేజర్‌గా ఆత్మకూర్ జడ్పీహెచ్ ఎస్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఫారుఖ్ ముక ్రం ఎంపికయ్యారు. అక్కడ ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు టోర్నమెంట్ నిర్వహించను న్నారు. ఇదే టోర్నమెంట్‌లో పాల్గొననున్న రాష్ట్ర బాలుర జట్టుకు జిల్లా కేంద్రంలోని తక్షశిల పాఠశాల విద్యార్థి కె. ద్రోణదత్త ఎంపికయ్యాడు.

టీ-20 లీగ్‌లో విజేతగా ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎ-డివిజన్ టీ-20 లీగ్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మారేడ్‌పల్లి క్లబ్స్‌పై మూడు వికెట్ల తేడాతో గెలిచి జిల్లా జట్టు చాంపియన్ నిలిచింది. ఉమ్మడి జిల్లాల జట్టులో నలుగురు జిల్లా క్రీడాకారులు రాణించారు. గణేష్ 201 పరుగులు, ఐదు వికెట్లు, అరుణ్‌కుమార్ 13 వికెట్లు, డేవిడ్ క్రిపాల్ 78 పరుగులు, రెండు వికెట్లు, జయసింహా రెండు మ్యాచ్‌లు ఆడి, రెండు వికెట్లు తీసి రాణించారు. టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు సురేష్‌కుమార్, గోపాలకృష్ణ అభినందించారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా బాక్సింగ్ ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని స్టేడియం మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల, బాలికల బాక్సింగ్ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ శారదాబాయి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ నర్సింహులు, పీడీ నిరంజన్‌రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం

» మళయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం 20వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహణ



వార్షికోత్సవానికి హాజరైన వివిధ పీఠాల అధిపతులు, స్వామీజీలు



ప్రణవ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు, స్వామీజీలు

జడ్చర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలోని గంగాపురం శ్రీమలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం 20వ వార్షికోత్సవాలు శుక్రవారం నాడు ఘనంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి పరమాత్మానందగిరి ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. సుప్రభాత సేవ, అనంతరం ప్రణవ పతాక ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. అనంతరం అఖండ జ్యోతి ప్రజ్వలన, 1008 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, రుద్రాభిషేకం, గీతాపారాయణం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు అగ్నిప్రతిష్ఠ కొనసాగింది. ఆ తర్వాత మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం అర్చకులు లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాలు, ఆశ్రమాల అధిపతులు శంకరా నందగిరిస్వామి, ప్రకాశానందగిరి స్వామి, తిరుపతి తీర్థానందస్వామి, అమృతానందగిరిస్వామి, ప్రణవానంద భారతిస్వామి, దయానందగిరిస్వామి, రామకృష్ణానందగిరి స్వామి, హేమసుందర్‌దాస్, ఆలయ నిర్వాహకులు వెంకట్‌చరణ్ పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మూసాపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని సంకలమద్ది శివారు, వేములస్టేజీ సమీపంలో లారీ ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మూసాపేట ఎస్ఐ పి.శ్రీనివాస్ తెలిపిన వివరాలా ఉన్నాయి. దాదాపు 45 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి సంకలమద్ది శివారులోని వేముల స్టేజీ వద్ద జాతీయ రహదారి దాటుతుండగా, కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున లారీ ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ వ్యక్తి గత కొంతకాలంగా మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని గ్రామాల్లో భిక్షాటన చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురీలో గదికి తరలించామని, వివరాలు తెలిసిన వారు మూసాపేట పోలీసులను సంప్రదించాలని కోరారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

600 కిలోల నల్లబెల్లం పట్టివేత



స్వాధీనం చేసుకున్న వాహనం, పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

తెలకపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న నల్ల బెల్లం, అలాంలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి ఆదేశం మేరకు శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులు తెలకపల్లి మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామాలు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ప్రతాప్, సుధాకర్ అనే వ్యక్తులు టాటా ఏస్ వాహనంలో పెద్దకొత్తపల్లి నుంచి వస్తుండగా ఆపి తనిఖీలు చేశారు. వాహనంలో సోదా చేయగా సంచుల్లో నింపిన ఆరు వందల కిలోల నల్లబెల్లం, సారా తయారీకి వినియోగించే 50 కిలోల అలాంను ఉన్నట్లు గుర్తించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. తనిఖీల్లో నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ ఎస్ఐ అరుణ, కానిస్టేబుల్ రాఘవేందర్, రవీందర్‌గౌడ్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పది మంది వైద్య విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు

» ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేశ్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యకళాశాలలో జూనియర్లను ర్యాగింగ్ చేసిన 10 మంది సీనియర్ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థులను కళాశాల నుంచి సస్పెండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కొత్తగా 2023 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులను కళాశాలలోని కొందరు విద్యార్థులు మీ తల్లిదండ్రులు ఏం చేస్తుంటారు? కళాశా లకు ఎందుకొచ్చావు? అని సున్నితంగా ర్యాగింగ్ చేసినట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై విచారణ నిర్వహించినట్లు తెలిపారు. పది మంది విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తేలిందని పేర్కొన్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. మందలింపు చర్యలో భాగంగా ఆ విద్యార్థులను వారి తల్లిదండ్రుల వెంట ఇళ్లకు పంపించామని పేర్కొన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఉండేందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వారిని సస్పెండ్ చేయలేదని స్పష్టం చేశారు. ఆ విద్యార్థులు ఈ నెలాఖరులో కళాశాలకు వస్తారని తెలిపారు.

నేడు ఇషా ఫౌండేషన్ వాలీబాల్ పోటీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం వాలీబాల్ బాలుర పోటీలు మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామీణ జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇప్పటికే 35 జట్లు పేర్లు నమోదు చేసు కున్నాయని తెలిపారు. ఆసక్తి గల గ్రామీణ వాలీబాల్ జట్లు 9885148821 నంబ ర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. టోర్నీలో విజేతకు తొమ్మిది వేలు, రన్నర్ జట్టుకు ఆరు వేలు, మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు మూడు వేలు, నాలుగవ స్థానం దక్కించుకున్న జట్టుకు రెండు వేల రూపాయల నగదు, ట్రోఫీని అందించనున్నట్లు తెలిపారు. విజేత, రన్నర్ జట్లు హైదరాబాద్ నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు.

ఇంటర్వ్యూ..



ధాన్యాన్ని సేకరిస్తున్నాం..

- మల్లయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి

ఖిల్లాఘణపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించడానికి వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని మండల వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య తెలిపారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఏఈఓలు తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన అనంతరం కాంటా వేస్తారు. అనంతరం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన గోదాములకు తరలిస్తామని తెలిపారు.

మండలంలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి.?

మండలంలో పీఏసీఎస్‌లో 17, ఐకేపీ ద్వారా 11, కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. మండలంలో సన్న రకాలు 22, దొడ్డు రకం ఆరు కేంద్రాలు ఉన్నాయి.

ఎన్ని రకాల సన్నధాన్యం సేకరిస్తారు? ఎలా గుర్తిస్తారు?

22 రకాల వరి సన్న ధాన్యాన్ని గుర్తించడానికి ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. సన్న ధాన్యాన్ని గుర్తించడానికి గింజ పొట్టు తీసి, పొడవు, వెడల్పులను కొలత చేసి డయల్ క్యాలిబర్ మీటర్‌లో వేసి పరీక్షిస్తాం. ప్రతీ కొనుగోలు కేంద్రంలో క్యాలిబర్ మీటర్‌ను అందుబాటులో ఉంచాం.

తేమ శాతంను ఎవరు సర్టిఫై చేస్తారు?

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే వరి ధాన్యం తేమ శాతంను పక్కాగా మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సర్టిఫై చేస్తారు.

క్వింటాల్‌కు అందించే ధర ఎంత?

రైతులు తాలు లేకుండా నాణ్యవంతంగా తెచ్చిన ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ.2320, బి గ్రేడ్ రూ.2,300 చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుంది.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలా గోదాంకు తరలిస్తారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని కాంటా వేసిన తరువాత ప్రతీ రైతు నుంచి సేకరించిన వరి బస్తా ధాన్యం రకం, ఆధార్ కార్డు మొదటి నాలుగు నంబర్లు, కొనుగోలు కేంద్రం సెంటర్ కోడ్, ధాన్యం రకం కొనుగోలు చేసిన ప్రతీ బస్తాపై ప్రింట్ చేసి తరలిస్తాం.

మండలంలో ఎంత ధాన్యం సేకరిస్తారని అంచనా వేశారు?

మండలంలో వానాకాలంలో వేసిన వరి పంటను 15,991 నుంచి 41,494 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరిస్తామనే అంచనా ఉంది.

భూదాన్ భూములను విడిపించాలి

వనపర్తి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూదాన్ భూములను చెర విడిపించి పేదలకు పంపిణీ చేయాలని సర్వోదయ మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆచార్య వినోబా భావే 42వ వర్ధంతిని సర్వోదయ మండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వినోబా భావే దేశమంతా పర్యటించి 44 లక్షల ఎకరాల భూమిని భూదానోద్యమం ద్వారా సేకరించారని అన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామ్, గోపాలకృష్ణ, శ్రీహరి, మోష, లక్ష్మీనారాయణ, ఎత్తం మహేష్, రమణ, రాంబాబు, శ్రీదేవి, ప్రదీప్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం వాహనం

ఖిల్లాఘణపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిర్మలాయపల్లి బస్‌స్టాండ్ వద్ద శుక్రవారం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఏపీ 22 డబ్ల్యూ 5337 బొలెరో వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం గంజి వద్ద రేషన్ షాప్ డీలర్ రఫీక్ నుంచి రేషన్ బియ్యం కిలో రూ.12 చొప్పున మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రవీణ్ 20 క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేశాడు. 40 సంచుల్లో ఖిల్లాఘణపురంలో కార్తీక్ అనే వ్యక్తికి కిలో బియ్యం రూ.20 చొప్పున విక్రయించడానికి తరలిస్తుండగా.. వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న గొల్ల ప్రవీణ్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ పంచనామా చేసి వివరాలు సేకరించారు. రేషన్ బియ్యం, వాహనాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించిన విద్యార్థులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో నిర్వహించిన భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని ప్రారంభించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమాన్ని వనపర్తి ఐడీవోసీలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌ను వసతి గృహాల విద్యార్థులు వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రత్యేక అధికారి డీఈఈ సత్యనందం, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడద తీరేదెలా..!

● పట్టణంలో స్వైర విహారం
● గుంపులుగా ఇళ్లలోకి చొరబడుతున్న వైనం
● భయాందోళనకు గురవుతున్న పట్టణ ప్రజలు



బుద్దారం నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్లే దారి మధ్యలో..



సాయినగర్ కాలనీలోని ఓ ఇంట్లో తిష్ట వేసిన కోతులు

వనపర్తి అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణంలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. రోజు రోజుకు కోతుల సంఖ్య అమాంతం పెరిగిపోతున్నాయి. ప్రతీ రోజు పలు కాలనీల్లో పదుల సంఖ్యలో కోతులు దర్శనమిస్తున్నాయి. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకు వాటి నుంచి తప్పించుకునేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కాలనీల్లోని కిరాణం దుకాణాలతో పాటు ఇళ్లల్లోకి వచ్చి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. అవి ఎక్కడ దాడి చేస్తాయో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

భయపడుతున్న విద్యార్థులు

పట్టణంలోని పలు కాలనీలలో కోతులు తిష్ట వేయడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పెద్దవారు వెంట ఉంటే గాని పిల్లలు బయటకు రావడంలేదు. కర్రలు చేతిలో పట్టుకొని తరిమితే తప్పా.. అవి వెళ్లడం లేదు. ప్రధానంగా పట్టణంలో టీచర్స్ కాలనీ, సాయినగర్ కాలనీ, ఐజయ్య నగర్, జంగిడిపురం, రామాలయం, న్యూటౌ కాలనీ, కేడీఆర్ నగర్‌లో కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్ధారం నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే దారి మధ్యలో ప్రయాణించే వాహనదారులకు కోతులు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. బుద్ధారం గండి వద్ద ఆంజనేయస్వామి ఆలయానికి మొక్కులు తీర్చు కునేందుకు భక్తులు తెచ్చుకున్న టెంకాయలు, అల్పాహారం వారి చిన్నపాటి వస్తువులను కోతులు ఎత్తుకెళ్తున్నాయి. కోతుల బెడదపై మహిళలు స్థానిక కౌన్సిలర్లకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

అభ్యర్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 17, 18వ తేదీల్లో టీజీపీఎస్సీ నిర్వహించే గ్రూప్ 3 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్దేశించిన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8,312 మంది విద్యార్థులు గ్రూప్ 3 పరీక్షలు రాసేందుకు 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నవంబరు 17న పేపర్ 1 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానుండగా, అభ్యర్థులను 8:30 వరకే లోపలికి అనుమతించనున్నట్లు తెలిపారు. పేపర్ 2 పరీక్ష మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుండగా 1:30 లోపే కేంద్రంలోకి అనుమతించనున్నట్లు వివరించారు. నవంబరు 18న పేపర్ 3 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానుండగా, అభ్యర్థులను 8:30 వరకే లోపలికి అనుమతించనున్నట్లు తెలిపారు. నిర్దేశిత సమయం దాటిన తరువాత అభ్యర్థులను లోపలికి అనుమతించేది ఉండదని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వచ్చేటప్పుడు తప్పనిసరిగా హాల్‌టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి స్మారక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోవర్ధన్ సాగర్ మాట్లాడారు. విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాసులు, తేజ కుమార్, వెంకటేశ్వరమ్మ, ఇక్బాల్, పాఠకులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యుడు బాలకిష్టయ్య

వనపర్తి వైద్య విభాగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజల గుండెల్లో ప్రజా వైద్యుడిగా కిష్టయ్య చిరస్థాయిగా నిలిచి ఉంటారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. డాక్టర్ బాలకిష్టయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలోని విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బాలకిష్టయ్య తన వైద్య వృత్తితో ఎంతో మంది పేద ప్రజల ప్రాణాలు కాపాడి ప్రజా డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఆయన 25 ఏళ్లు సర్పంచ్‌గా, చైర్మన్‌గా పదవులు నిర్వహించి ముందు చూపుతో ఆనాడే వనపర్తికి శాశ్వత తాగునీటి పథకం ఏర్పాటు చేశారని అన్నారు.

- జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకిష్టయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణంలోని బాలకిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సతీష్ యాదవ్, కొత్త గొల్ల శంకర్, గంధం నాగరాజు, గంధం భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పట్టణాలకు విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

వనపర్తి టౌన్ ,నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులు మునిసిపల్ పట్టణాలకు విస్తరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం నూతన జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పాల్గొని సీపీఎం జిల్లా మూడో మహాసభల్లో జరిగిన నూతన కమిటీని నూతన కార్యదర్శి వర్గాన్ని ప్రకటించారు. నూతన సీపీఎం జిల్లా కార్యదర్శిగా పుట్ట ఆంజనేయులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా సీనియర్ నాయకులు ఎండీ జబ్బార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా బాల్‌రెడ్డి, జీఎస్ గోపి, లక్ష్మి, రాజు లను కార్యదర్శి వర్గంగా ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుందని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులుగా మేకల ఆంజనేయులు, మహబూబ్ బాషా, రాజు, వెంకటేష్, ఆర్ఎన్ రమేష్, కృష్ణయ్య, బాల్యా నాయక్, పరమేశ్వర ఆచారి, వెంకటయ్య, వెంకట్ రాములు, ఆదిని మొత్తం 19 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా మహాసభలో చేసిన తీర్మానాలను వివరించారు.

ఆలయాలకు కార్తీక శోభ ..





వనపర్తిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు, న్యూ గంజిలో..



శ్రీరంగాపురం ఆది బసవ ఆలయంలో..

కొత్తకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలయాలు భక్తులతో శుక్రవారం కిటకిటలాడాయి. కార్తీక మాసం పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకంగా నిర్వ హించిన హోమ పూజలో భక్తులు పాల్గొన్నారు.

వీపనగండ్ల : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు.

శ్రీరంగాపురం : శ్రీరంగాపురం సమీపంలో వెలిసిన ఆది బసవయ్య ఆలయంలో కార్తీక మాస పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఖిల్లాఘణపురం : మండలంలోని అన్ని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో మహిళలు దీపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శివలింగాలకు అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించి కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, రామాలయం, న్యూగంజ్ లక్ష్మి గణపతి ఆలయం, తదితర దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. తెల్లవారు జామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆయా దేవాలయాలకు బారులు తీరారు. ఉదయం సాయంత్రం ఆలయా ల్లో శివ పార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషే కాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో శివనామస్మరణ చేస్తూ స్వామి వారిని కీర్తించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయాల్లో దీపాలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వనపర్తిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

సెల్‌ఫోన్‌ల అప్పగింత

ఖిల్లాఘణపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరాయపల్లికి చెందిన ఎండీ రజాక్, మల్కిమియాన్‌పల్లికి చెందిన పట్నం చిన్నయ్యలు కొన్ని రోజుల కిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను శుక్రవారం ఎస్ఐ సురేష్ గౌడ్ రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు.

తడిసిన ధాన్యం

వీపనగండ్ల, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి వరి ధాన్యం తడిసిపోయింది. వీపనగండ్ల, కల్వరాల, గోవర్ధనగిరి, తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. వర్షం రావడంతో రైతులు ధాన్యంపై కవర్లను కప్పలేకపోయారు. దీంతో ధాన్యం తడిసి కొంత మేరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యం సైతం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వర్షం రావడంతో వరి కోతలు నిలిచిపోయాయి.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కొత్తకోట విద్యార్థి ఎంపిక

కొత్తకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాడ్స్‌ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థి బాబ అజ్మీర్ రాష్ట్రస్థాయి అండర్ 17 బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు అకాడమీ అధ్యక్షుడు మాస్టర్ అబ్దుల్ నబీ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అండర్ 17 బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఆ మేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాబ అజ్మీర్‌ను అకాడమీ విదార్థులు, మాస్టర్లు అభినందించారు. మాస్టర్లు జాఫర్, సాదిక్, హరీష్ యాదవ్, ఇంతియాజ్, అంజి, మంజునాథ్ పాల్గొన్నారు.

పెన్నుల పంపిణీ

చిన్నంబావి నవంబరు 15, (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని గడ్డబస్వాపుర్‌లో. జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు. వెంకటేష్. కరుణాకర్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు. అగన్‌వాడీ టీచర్ వేనమ్మ. శ్రీకాంత్. సురేష్ నాయుడు. కృష్ణ రమేష్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

ఖిల్లాఘణపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం బారిన పడిన రోగులకు మెరుగైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బండారి వెంకటేష్ అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హైదరాబాద్ ప్రగతి భవన్‌లో బాధితుడికి మెరుగైన చికిత్స నిమిత్తం రూ.2,50,000 ఎల్‌వోసీ అందజేశారు. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేష్, అజీమ్ పాల్గొన్నారు.

శ్రీరంగాపురం : మండల పరిధిలోని వెంకటాపురం, జానంపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వారి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ మండల నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కురుమన్న, ఆశన్న, విజయ్ కుమార్ రెడ్డి, ఎండి ఉమర్, విజయ్ కుమార్, బయో సాయన్న పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ నోములు

పెబ్బేరు/శ్రీరంగాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కార్తీక మాసం పురస్కరించుకుని కేదారేశ్వరి గౌరీ నోములను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గౌరీ నోములతో పాటు వ్రతాలు నిర్వహించారు. ఉమ్మడి మండలంలో పెబ్బేరు చెలిమిల్ల, సూగూరు, బున్యాదిపురం, వెంకటాపురం, రంగాపురం, గుమ్మడం, అయ్యవారిపల్లి, పాతపల్లి , యాపర్ల గ్రామాలతో పాటు మండల కేంద్రమైన శ్రీరంగాపురం, కంబాలపురం, శేరిపల్లి, తాటిపాముల నాగరాల వెంకటాపురం, జానంపేట గ్రామాల్లో ప్రజలు నోములు జరుపుకొన్నారు.

మాలల హక్కుల కోసం పోరాడాలి

అమరచింత, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాలల న్యాయబద్ధమైన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ మాలల ఐక్యవేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు భోజరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆయన మండల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాలలకు అన్యాయం జరిగే ఎస్సీ వర్గీకరణను ప్రతీఒక్కరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా మాలల సింహగర్జన సభ నిర్వహిస్తున్నామని, మాల కులస్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రీల్స్ చూస్తాం.. స్వీపరుతో పనిచేయిస్తాం..

- పీహెచ్‌సీకి వెళ్లిన రోగులను పట్టించుకోని స్టాఫ్ నర్సు



సెలైన్ బాటిల్ తీస్తున్న స్వీపర్

గోపాల్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన శిరీష గర్భిణి. రక్తం తక్కువ ఉడటంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్లూకోస్ (ఐరన్ బాటిల్) పెట్టించుకోడానికి వెళ్లింది. శుక్రవారం సెలవు దినం కావడంతో ఒకే ఒక స్టాఫ్ నర్సు ఉన్నారు. సదరు గర్భిణి సెలెన్ పెట్టించుకోవడం పూర్తయ్యాక, బాటిల్ అయిపోయిందని, గర్భిణి సోదరుడు స్టాఫ్‌నర్సుకు తెలియజేయగా.. ఫోన్‌లో రీల్స్ చూస్తూ.. ఆసుపత్రిలో పనిచేస్తున్న స్వీపరుకు గ్లూకోస్ బాటిల్‌ను తీయాలని ఆదేశించింది. సుస్తి చేసిందని ఆసుపత్రికి వెళ్లిన వృద్ధుడితో అసభ్యంగా మాట్లాడింది. స్టాఫ్‌నర్సు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఆమెపై చర్యలు చేపట్టాలని, గ్రామస్థులు మండిపడుతున్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న చైర్మన్ బాధగౌని మానస

పాన్‌గల్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని పైన్ ఏ లైఫ్ ట్రస్టు ఫౌండర్ చైర్మన్ బాదగౌని మానస అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతకుంటలో గ్రామ యువకుల ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన తాడిపర్తి జట్టుకు రూ. 50 వేల నగదుతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యురాలు బాధగౌని అనూష, స్థానిక నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



చిక్కేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి, చిక్కేపల్లి, శాఖాపూర్, కదిరెపాడు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం దళారుల చేతుల్లో పడి మోసపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. వెంకటేష్ నాయుడు, రవి కుమార్, రామ్మూర్తినాయుడు, భాస్కర్‌యాద్, ప్రసాద్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, బీరయ్య, బిలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘణపురం : రైతులు పండించిన వరి ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. తాలు, మట్టి, రాళ్లు లేకుండా వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి తెలిపారు . మండలంలోని సూరాయపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వరి పంటకు కనీస మద్దతు ధర పొందాలంటే రైతులు కేంద్ర ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో క్యామ రాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుల గణన సర్వే



ఆత్మకూరులో వివరాలు సేకరిస్తున్న మునిసిపల్ కమిషనర్

పాన్‌గల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, కులగణన సర్వే కొనసాగుతుందని ఎంపీడీవో గోవిందరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వెంగళాయిపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా కుటుంబ సర్వే ఆత్మకూరు పట్టణ కేంద్రంలో నిరంతరాయంగా కొనసాగుతుందని మునిసిపల్ కమిషనర్ శశిధర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలో చేపట్టిన సర్వేలో ఆయన పాల్గొన్నారు.

అమరచింత : కుటుంబ సమగ్ర సర్వే శుక్రవారం ఆయా గ్రామాల్లో కొనసాగింది.

అయ్యప్ప భక్తుల మాలధారణ



మాలధారణ చేసిన ఆత్మకూరు పట్టణ అయ్యప్ప భక్తులు

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణ కేంద్రంలో అయ్యప్ప భక్తులు మదనాపూర్ గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారణ చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 90 రోజుల పాటు స్వామి వారికి మాలధారణతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో మెకానిక్ శ్రీనివాస్ గురుస్వామి, ఎస్టీడీ శ్రీనివాస్ గురు స్వామి, స్వాములు సురేష్, ఆనంద్, కన్నె స్వాముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి




గురునానక్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సిక్కు మత గురువు గురునానక్ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురునానక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, మునిసిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, చందర్, నక్క రాములు, రవి యాదవ్, ఎల్లైసి కృష్ణ, శరవంద, బొంబాయి మన్యంకొండ, చుక్క రాజు, రంజిత్, వెంకటేష్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యం

రేవల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ బీజేపీ కార్యకర్త కష్టపడి పని చేయాలని జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు మండల ఇన్‌చార్జ్ గంధం ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు అజయ్ గౌడ్ ఆధ్వర్యంలో రేవల్లి మండలంలో ఎన్నికల నిర్వహణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ సభ్యత్వాన్ని ఉపయోగించుకుని ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి ప్రతీ కార్యకర్త కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు పరిపూర్ణచారి, మండల ఉపాధ్యక్ష్యుడు రాము, జమ్ములు, సైదులు, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

హత్యా, ఆత్మహత్యా?



బంకల ఎల్లస్వామి(ఫైల్)

రేవల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వ్యక్తి బంకల ఎల్లస్వామి(45) అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన రేవల్లి మండలం గొల్లపల్లిలో చోటు చేటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంకల ఎల్లస్వామి అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, విషయం బయటపడటంతో ఆ మహిళ కుటుంబ సభ్యులు ఎల్లస్వామిని చంపి చెరువు వద్ద ఉన్న బావిలో వేసి హత్యను, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎల్లస్వామి భార్య రాజమ్మ గురువారం పోలీస్‌స్టేషన్‌లో తన భర్త కనిపించడంలేదని ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు భర్త మృతదేహం బావిలో దొరికిందని రాజమ్మ తెలిపారు. హంతకులు ఎవరైనా వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ విషయంపై ఎస్ఐ రామును వివరణ కోరగా.. రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.